

'ఆహార భద్రత'..మరో ఐదేళ్లు
రేషన్ కార్డు దారులకు కేంద్రం తీపికబురు తెలిపింది. మరో ఐదేళ్ల పాటు ఉచితంగా బియ్యం అందించనున్నట్లు ప్రకటించింది.
- 8లో▸



ఘనంగా గౌరీనక్తం
హనుమకొండలోని వేయిస్తంభాల దేవాలయంలో గౌరీనక్త వ్రత పూజలు ఘనంగా నిర్వహించారు.
- 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం $32.5^0/14.7^0$
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే మురళీనాయక్



మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ శశాంకను మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక ఎమ్మెల్యేకు అభినందలు తెలిపారు. అనంతరం మానుకోట నియోజకవర్గంలోని పలు అంశాలపై ఎమ్మెల్యే మురళీనాయక్ కలెక్టర్‌తో చర్చించారు.

ఎస్పీ పాటిల్‌ను..
మహబూబాబాద్ రూరల్: జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్‌ను మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ బుధవారం కలిశారు. ఎస్పీ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలి



తొర్రూరు: ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేసి ప్రభుత్వం ఆదుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలో ఐఎఫ్‌టీయూ ఏరియా కమిటీ సమావేశం నిర్వహించారు. రవి మాట్లాడుతూ.. మున్సిపాలిటీ, పంచాయతీలు, కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించడం ఇబ్బందిగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఔట్ సోర్సింగ్ సిబ్బంది సేవలను క్రమబద్ధీకరించే చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ప్రతినిధులు రాయిశెట్టి రాజశేఖర్, ఎండీ షరీఫ్, సేగ్యం వెంకన్న, బీసు సుధాకర్, సోమనర్సయ్య, పుల్లయ్య, మహేందర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



మహబూబాబాద్ రూరల్: రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు మహబూబాబాద్ మండలంలోని వీఎస్ లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం ప్రసాదరావు, పీఈటీ సమ్మెట ప్రేమ్‌కుమార్ బుధవారం తెలిపారు. విద్యార్థులు గోపిచంద్, సృజన్, సుశాంత్, మధూకర్, కల్యాణి, షర్మిల ఈ నెల 4న మానుకోట ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. తొర్రూరు పట్టణంలో ఈనెల 16నుంచి 18వ తేదీ వరకు రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు జరుగుతాయన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, మోహన్, వెంకన్న, షేక్ అలీ అభినందించారు.

ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి



తొర్రూరు: ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిచింత విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. బుధవారం డివిజన్ కేంద్రంలో టీపీటీఎఫ్ డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు సోమారపు ఐలయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడారు. మేనిఫెస్టోలో పొందుపర్చిన విధంగా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. మెగా డీఎస్సీ వేసి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో టీపీటీఎఫ్ ముందు వరుసలో నిలుస్తుందన్నారు. సమావేశంలో నాయకులు ఏర్పుల సైదులు, శ్రీనివాస్, సతీష్, వెంకట్రాంనర్సయ్య, జనార్దన్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వర్తించాలి

నర్సింహులపేట: గ్రామాల్లో వైద్య సిబ్బంది సక్రమంగా పని చేయాలని డీఎంహెచ్‌ఓ అంబరీష అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని హెల్త్ సబ్‌సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి మాట్లాడారు. గ్రామాలు, తండాల్లో వైద్య సిబ్బంది నిత్యం పర్యటించాలని సూచించారు. జ్వరాలు వస్తే స్థానిక వైద్య సిబ్బందిని సంప్రదించాలని ప్రజలను కోరారు.

'ఉపాధి'లో టాప్

ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల్లో మానుకోట రాష్ట్రంలో మొదటిస్థానం
- జిల్లాలో 98.81శాతం టార్గెట్ పూర్తి
- మూడు నెలల ముందుగానే లక్ష్యం చేరిక
- 100రోజుల పనులు పూర్తి చేసిన 2,855 మంది కూలీలు
- 80రోజులకు పైగా పనిచేసిన 13,480మంది



సాక్షి, మహబూబాబాద్: ఉపాధి హామీ పనుల్లో జిల్లా ముందంజలో ఉంది. నిర్దేశించిన లక్ష్యాన్ని మూడు నెలల ముందుగానే పూర్తి చేసి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. కాగా ప్రతీ సంవత్సరం వ్యవసాయ సీజన్‌లో పనులు మొదలు పెట్టి లక్ష్యం పూర్తి కాక ఇబ్బందిపడ్డ గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు.. ఈ సీజన్ ప్రారంభం నుంచే అవకాశం ఉన్న ప్రతీ చోట పనులు కల్పించారు. దీంతో లేబర్ బడ్జెట్ లక్ష్యం పూర్తి చేశారు.

మూడు నెలల ముందుగానే..
ప్రతీ సంవత్సరం మార్చి నెల చివరి వరకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాల్సి ఉంటుంది. కాగా ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 45,63,894 పనిదినాలు కల్పించాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 45,09,361 పనులు పూర్తి చేశారు. అంటే 98.81శాతం పనులు ఇప్పటికే పూర్తి చేశారు. ఆర్థిక సంవత్సరం ముగింపు(మార్చి 31) మరో 100రోజులు ఉండగానే లక్ష్యం పూర్తి చేశారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 8,87,29,551 పనిదినాలు కల్పించగా.. సగటు 63.55శాతం ఉంది. జిల్లాలో మాత్రం 98.81శాతం పనులు పూర్తయి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచాం. ఇందులో అత్యధికంగా గార్ల మండలం 120.96శాతంతో మొదటి స్థానంలో నిలువగా.. బయ్యారం మండలం 74.40శాతంతో చివరి స్థానంలో నిలిచింది. అదేవిధంగా నెల్లికుదురు, కురవి, నర్సింహులపేట, కేసముద్రం, కొత్తగూడ, డోర్నకల్ మండలాల్లో వందశాతానికి పైగా లక్ష్యం పూర్తి చేశారు.

వేగంగా పనులు..
జిల్లాలో 2.15లక్షల జాబ్ కార్డులు, 4.55లక్షల మంది ఉపాధి హామీ పథకంలో పనిచేసేందుకు పేరు నమోదు చేసుకున్న కూలీలు ఉన్నారు. ఇందులో 1.42లక్షల జాబ్ కార్డులకు సంబంధించిన 2.6లక్షల మంది కూలీలు పనిచేసేవారు ఉన్నారు. ప్రతీ జాబ్ కార్డుకు వంద రోజుల పని కల్పిస్తారు. అయితే గత ఏప్రిల్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 2,855 జాబ్ కార్డుల్లోని కూలీలు వంద రోజుల పనిని పూర్తి చేసుకున్నారు. అదేవిధంగా 13,480 జాబ్ కార్డుల్లోని కూలీలు 81 రోజుల నుంచి 99 రోజుల లోపు పని చేసిన వారు ఉన్నారు.

జిల్లాలో జాబ్ కార్డులు	2.51లక్షలు
నమోదైన కూలీలు	4.55లక్షలు
యాక్టివ్ జాబ్ కార్డులు	1.42లక్షలు
పనిచేస్తున్న కూలీలు	2.6లక్షలు
ఈ ఆర్థిక సంవత్సరంలో పనిదినాల లక్ష్యం	45,63,894
ఇప్పటి వరకు చేసిన పనిదినాలు	45,09,361
100రోజుల పనిచేసిన పూర్తి చేసిన కార్డుదారులు	2,855
81–99 పనిదినాలు పూర్తి చేసిన కార్డుదారులు	13,480

లక్ష్యం త్వరగా పూర్తి చేశారు



పని కావాలని కోరిన ప్రతీ ఒక్కరికి పని కల్పించడమే లక్ష్యం. ఇందుకోసం ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేసేందుకు ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచే ప్రణాళికతో పనులు చేయించాం. మూడు నెలల ముందుగానే లక్ష్యం పూర్తి చేయడం సంతోషకరం. అయితే మరో మూడు నెలల సమయం ఉంది. లక్ష్యానికి మించి కూలీలకు పని కల్పిస్తాం. దీంతో మెటీరియల్ కాంపొండ్ కింద అదనపు నిధులు కూడా వస్తాయి. ఆ నిధులు గ్రామాల్లో ఇతర అభివృద్ధి పనులకు ఉపయోగపడుతాయి.
– సన్యాసయ్య, డీఆర్‌డీఓ, మహబూబాబాద్

మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన ధాన్యం



ధాన్యం కొనుగోళ్లలో జాప్యం

మార్కెట్లలో రైతుల పడిగాపులు
- మహబూబాబాద్, కేసముద్రం మార్కెట్లకు పోటెత్తుతున్న ధాన్యం

మహబూబాబాద్ రూరల్: జిల్లాలోని మానుకోట, కేసముద్రం వ్యవసాయ మార్కెట్లలో ధాన్యం కొనుగోళ్లలో జాప్యం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో కొనుగోళ్లు చేపట్టక పోవడంతో రాత్రి సమయాల్లో చలికి వణుకుతూ ధాన్యం రాశుల వద్ద ఉండాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ దుస్థితి దాపురించిందని వాపోతున్నారు.

రోజుల తరబడి..
మార్కెట్‌కు ధాన్యం తీసుకొచ్చిన రైతులు రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఇటీవల మిచాంగ్ తుపాను ప్రభావంతో రైతుల ధాన్యం తడిసి, రంగు మారింది. దీంతో వ్యాపారులు అడిగిన ధరకే సరుకు అమ్ముకున్నామని పలువురు రైతులు వాపోయారు. మళ్లీ తుపాను ముప్పు ఉందని తెలియడంతో వరి కోతలు కోసి ధాన్యాన్ని మార్కెట్‌కు తరలిస్తున్నారు. దీంతో జిల్లాలోని మహబూబాబాద్, కేసముద్రం మార్కెట్లలో ధాన్యం బస్తాలు పోటెత్తుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరగడం, మరోవైపు దళారుల చేతివాటంతో రైతన్నలు మోసపోతున్నారు.

ఆలస్యం చేస్తున్నారు..
రైతులు కాంతి,లాల్యా, జామ్లా, వెంకన్న, హరిలాల్, మంగీలాల్, తేజ్యా మాట్లాడుతూ.. తాము నాలుగు రోజులక్రితం మానుకోట మార్కెట్‌లో ధాన్యం పోస్తే కొనుగోళ్లలో జాప్యం చేస్తున్నారని తెలిపారు. ఒకవేళ కొనుగోళ్లు చేపట్టినా బస్తాలు నింపడం, కాంటాలు పెట్టడంలో జాప్యం చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కొనుగోళ్లలో వేగం పెంచాలని రైతులు కోరుతున్నారు.



సమస్యలు వివరిస్తున్న రైతులు



స్వయంగా బస్తాలో ధాన్యం నింపుతున్న మహిళా రైతు కాంతి

ధాన్యం.. ఘనం - 8లో▸

అంకితభావంతో సేవలు అందించాలి

- ఎస్పీ సంగ్రామ్ సింగ్‌జీ పాటిల్



మాట్లాడుతున్న ఎస్పీ సంగ్రామ్ సింగ్‌జీ పాటిల్

మహబూబాబాద్ రూరల్: పోలీసు అధికారులు, సిబ్బంది అంకితభావంతో ప్రజలకు సేవ చేసి పోలీసుశాఖకు మంచిపేరు తీసుకురావాలని ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ అన్నారు. మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ సమావేశ మందిరంలో జిల్లాలోని పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఎన్నికలలో పోలీసు అధికారులు, సిబ్బంది ఎంతో ప్రతిష్టాత్మకంగా విధులు నిర్వహించారని ఎస్పీ అభినందించారు. అనంతరం అన్ని పోలీస్ స్టేషన్లలో అమలు చేసే 17 ఫంక్షనల్ వర్టికల్స్ గురించి ఆయా సంబంధిత వర్టికల్ ఇన్‌చార్జ్ అధికారితో మాట్లాడించి ఏమైనా లోటుపాట్లు ఉన్నాయా అని చర్చించారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో అన్ని ఫంక్షనల్ వర్టికల్ అమలయ్యేలా చూడాలన్నారు. ముఖ్యంగా రిసెప్షన్ సెంటర్, ఈకాప్ రైటర్లు, కోర్టు డ్యూటీ అధికారుల విధుల గురించి చర్చించారు. తరచూ నేరాలకు పాల్పడే నిందితులను బైండోవర్ చేయాలని, విచారణ, దర్యాప్తులో ఉన్న కేసులను త్వరగా ఛేదించాలని, ఈ-చలాన్ విధానంలో నమోదైన కేసులలో జరిమానాల రికవరీ శాతాన్ని పెంచాలన్నారు. పోలీస్టేషన్ల వారీగా పోలీసు అధికారులతో మాట్లాడుతూ.. గతంలో పోలీస్టేషన్లలో నమోదైన కేసుల వివరాలను పూర్తిగా అడిగి తెలుసుకున్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న కేసుల ఆరా తీసి, అందుకు గల కారణాలను తెలుసుకున్నారు. ఆ కేసుల విషయంలో మరింత ముందుకు వెళ్లేందుకు తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చెన్నయ్య, డీఎస్పీలు తీర్థాల సత్యనారాయణ, వెంకటేశ్వరబాబు, సైబర్ క్రైమ్ డీఎస్పీ శ్రీనివాస్, ఎస్బీ సీఐ బాలాజీవరప్రసాద్, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, డీసీఆర్బీ సీఐ శ్రీనివాస్, జిల్లాలోని సీఐలు, ఎస్సైలు, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

'పల్లె'వెలుగులేవి!

గ్రామాల్లో రోడ్లు మెరుగుపడినా కనిపించని బస్సు సర్వీసులు
- పల్లె ఆడపడుచులకు అందని ఉచిత ప్రయాణం
- బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్న మహిళలు

నెల్లికుదురు: జిల్లాలోని చాలా గ్రామాల్లో తారు రోడ్లు వేశారు. దీంతో ఇతర పల్లెలు, పట్టణాలతో కనెక్టివిటీ పెరిగింది. అయితే ప్రైవేట్ రవాణా వ్యవస్థ మెరుగుపడినప్పటికీ.. ఆర్టీసీ సర్వీసులను మాత్రం వేయడం లేదు. దీంతో ప్రజలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. కాగా ప్రస్తుతం ప్రభుత్వం మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన నేపథ్యంలో ఆయా గ్రామాల మహిళలు బస్సు సర్వీసులు వేయాలని కోరుతున్నారు.

పల్లెలెన్నో...
ఆర్టీసీ బస్సులు పల్లెలను పలకరించడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. జిల్లాలో 18 మండలాలు, 461 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కాగా మహబూబాబాద్ డిపో నుంచి చాలా గ్రామాలకు ఆర్టీసీ సర్వీసులు నడవడం లేదు. పలు గ్రామాలకు ఉన్న సర్వీసులను అధికారులు రద్దు చేశారు. పల్లెలకు బస్సులు రాక ప్రైవేట్ బస్సులే దిక్కుగా మారుతున్నాయి. కొన్ని గ్రామాలకు స్కూలు వేళల్లో మాత్రమే బస్సులు నడుస్తున్నాయి.

మహాలక్ష్మి పథకంతో..
మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసేందుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దీంతో ఆర్టీసీ బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిలాడుతున్నాయి. కానీ గ్రామాలకు బస్సు సర్వీసులు లేకపోవడంతో ఈ అవకాశాన్ని మహిళలు కోల్పోతున్నారు.అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు



బస్టాండులో వేచిఉన్న ప్రయాణికులు

గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి



గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి. ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నాం. బస్సు సౌకర్యం కల్పిస్తే ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ప్రయాణంతో మహిళలకు మేలు జరుగుతుంది. అన్ని గ్రామాలకు బస్సులు నడిచేలా చూడాలి.
– బి.హేమలత, కందికొండ

సర్వీసు రద్దు చేశారు..



మహబూబాబాద్ నుంచి పెనుగొండ, నాయకపల్లి, బొల్లెపల్లి మీదుగా గూడూరుకు ఆర్టీసీ బస్సు ఉండేది. ప్రస్తుతం బస్సు నడవడం లేదు. గతంలో మా ఊరికి బస్సు వచ్చేది ప్రస్తుతం అది రాకపోవడంతో ఆటోలలో వెళ్తున్నాం. గతంలో మాదిరిగా బస్సు సౌకర్యం కల్పించాలి.
– కాకర్ల దేవమ్మ, బొల్లెపల్లి

సర్వీసులు పెంచుతాం



ఆర్టీసీ ప్రయాణికుల అవసరాల మేరకు ప్రస్తుతం బస్సులను నడుపుతున్నాం. ఉచిత ప్రయాణంతో ప్రయాణికుల నుంచి ఆదరణ వస్తుంది. కొన్ని ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సు సర్వీసులను పెంచుతాం.
– ఎం.శివప్రసాద్, ఆర్టీసీ, డీఎం

తూముతో సస్యశ్యామలం

సీతారామ కాల్వకు తూము ఏర్పాటు చేయాలంటున్న రైతులు
- ఎమ్మెల్యే చొరవ చూపాలని వేడుకోలు
- ముగింపు దశకు యాక్వడెట్ పనులు



మున్నేరువాగుపై ప్రాజెక్ట్ యాక్వడెట్ పనులు



కొనసాగుతున్న కాల్వ నిర్మాణ పనులు

డోర్నకల్: సీతారామ సాగునీటి ప్రాజెక్ట్ నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మణుగూరు సమీపంలో గోదావరి నుంచి 210 కిలోమీటర్ల దూరంలోని పాలేరు రిజర్వాయర్‌కు నీటిని తరలించేందుకు ప్రాజెక్ట్ నిర్మాణం చేపడుతున్నారు. కాగా భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మానుకోట జిల్లాల పరిధిలో ఈ ప్రాజెక్ట్ పనులు కొనసాగుతున్నాయి. కాగా జిల్లాలో 888 ఎకరాల భూమిని వినియోగిస్తుండగా.. ఏన్కూరు ప్రధాన కాల్వ నుంచి డోర్నకల్ మీదుగా పాలేరు రిజర్వాయర్ వరకు నాలుగు ప్యాకేజీలుగా విభజించి పనులు చేస్తున్నారు. ఇందులో 13వ ప్యాకేజీ పరిధిలో గార్ల మండలంలోని అటవీ ప్రాంతం, 14వ ప్యాకేజీలో డోర్నకల్, గార్ల, బుద్దారం, 15వ ప్యాకేజీలో డోర్నకల్ మండలంలోని 18 కిలోమీటర్లు, ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం పరిధిలో 5 కిలోమీటర్ల దూరం, 16వ ప్యాకేజీలో తిరుమలాయపాలెం మండలంలోని పలు గ్రామాల పరిధి ఉంది. పలు ప్రాంతాల్లో కాల్వల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

తూము నిర్మించాలని..
డోర్నకల్ పట్టణ సమీపంలోని మున్నేరువాగుపై సీతారామ ప్రాజెక్ట్‌కు సంబంధించిన యాక్విడెట్ పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. మున్నేరు ఆనకట్ట సమీపంలో 73 పిల్లర్లతో 900 మీటర్ల మేర వాగుపై అడ్డంగా సీతారామ నీటి ప్రవాహం కోసం యాక్వడెట్ పనులు చేపడుతున్నారు. కాగా మున్నేరువాగులో వేసవికాలంలో నీరు లేకపోవడంతో రెండో పంట సాగుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ మేరకు యాక్వడెట్ చివరన సీతారామ కాల్వకు తూము(ఆఫ్‌టెక్ స్లీస్) ఏర్పాటు చేసి మున్నేరువాగుకు నీటిని వదిలితే ఆనకట్ట నిండి 2వేల ఎకరాలకు పైగా రెండు పంటలు పండే అవకాశాలు ఉన్నాయి. తూముతో పాటు మున్నేరు వాగు వరకు కాల్వ నిర్మాణం కోసం కొంత భూమితో పాటు సుమారు రూ.20 నిధులు అవసరమయ్యే అవకాశం ఉంది. తూము ఏర్పాటు చేస్తే 100నుంచి 200 క్యూసెక్కుల నీరు మున్నేరు వాగులోకి చేరుకుంటుంది.

చొరవ చూపాలి..
సీతారామ ప్రాజెక్టు కాల్వకు తూము ఏర్పాటు చేసి మున్నేరుకు నీటిని తరలించేందుకు నూతనంగా ఎంపికైన ఎమ్మెల్యేతో పాటు ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు. యాక్వడెట్ నిర్మిస్తున్న ప్రాంతంలో బుద్దారం వైపు కాల్వకు తూము ఏర్పాటు చేసి అక్కడి నుంచి మున్నేరువాగు వరకు కాల్వ నిర్మించి నీటిని తరలిస్తే ఈ ప్రాంత రైతాంగానికి ప్రయోజనం చేకూరుతుంది. యాక్వడెట్ పనులు ముగింపు దశలో ఉన్నందున ఈ ప్రాంతంలో తూము ఏర్పాటుకు ఇదే సరైన సమయం కావడంతో ప్రజాప్రతినిధులు దృష్టిసారించాలని రైతులు కోరుతున్నారు.

జాప్యం లేకుండా పనులు చేపట్టాలి



ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచనలు, సలహాలు ఇస్తున్న శాంతకుమారి

దంతాలపల్లి: గ్రామాల్లో నర్సరీల నిర్వహణ పనుల్లో జాప్యం చేయవద్దని డీఆర్‌డీఏ అదనపు పీడీ శాంతకుమారి అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనులకు కూలీలు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనులపై ఫీల్డ్ అసిస్టెంట్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అంబుడ్స్‌మెన్ అధికారి ఆదామ్, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీఓ అప్సర్‌పాషా, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని సామాజిక, విద్య, వైద్య, సాహిత్యం, కళలు, క్రీడారంగాల్లో ఉత్తమ సేవ, ప్రతిభ కనబర్చిన క్రైస్తవులు, సంస్థలను ప్రభుత్వం సత్కరిస్తుందని, దీనికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ శాఖ అధికారి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 15వ తేదీ సాయంత్రం 5గంటల వరకు ఆన్‌లైన్‌లో సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 98859 83942, 040-23391066 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

మంత్రులను కలిసిన పూజారులు





మంత్రులు సీతక్క, సురేఖకు ప్రసాదం అందజేస్తున్న పూజారులు

ములుగు/ఎస్ఎస్‌తాడ్వాయి: రాష్ట్ర పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క, దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖను మేడారం ఈఓ రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, సమ్మక్క– సారలమ్మ పూజారులు హైదరాబాద్‌లో బుధవారం వేరువేరుగా మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రులకు బొకేలు అందించి ఆదివాసీ సంస్కృతి సంప్రదాయంగా శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. వనదేవతల పసుపు, కుంకుమ, బెల్లం ప్రసాదం అందజేశారు. జాతరకు సమయం దగ్గర పడుతుండడంతో అతి త్వరలో మేడారంలో సమ్మక్క–సారలమ్మ పూజారులు, దేవాదాయశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు, నిధుల ప్రతిపాదనలను సీఎం రేవంత్‌రెడ్డికి అందజేయనున్నట్లు మంత్రులు పూజారులకు తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్ సూపరింటెండెంట్ క్రాంతికుమార్, పూజారులు సిద్దబోయిన మునీందర్, అరుణ్‌కుమార్, కొక్కెర కృష్ణ, వెంకటేశ్వర్లు, సారయ్య, కిరణ్‌కుమార్, పూజారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పీజీ విద్యార్థులు 18వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించాలి

కేయూ క్యాంపస్‌ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్‌, ఖమ్మం, ఆదిలాబాద్‌ జిల్లాల్లోని పీజీ కళాశాలల ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ మూడో సెమిస్టర్‌ విద్యార్థులు ఈనెల 18వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి జ్యోతి తెలిపారు. రూ. 250 అపరాధ రుసుముతో ఈనెల 20వ తేదీవరకు గడువు ఉందని తెలిపారు. ఎంఏ, ఎంకాం కోర్సుల విద్యార్థులు అన్నిపేపర్లకు (రెగ్యులర్‌) రూ. 520 పరీక్షఫీజు, బ్యాక్‌లాగ్‌ మూడుపేపర్లు ఆపైరూ. 420, బ్యాక్‌లాగ్‌ రెండు పేపర్ల వరకు రూ. 160, ఇంప్రూవ్‌మెంట్‌ ప్రతి పేపర్‌కు రూ. 190 పరీక్ష ఫీజు చెల్లించాల్సింటుందన్నారు. ఎమ్మెస్సీ కోర్సుల్లో అన్ని సబ్జెక్టులకు రూ. 620, మూడుపేపర్లు ఆపై రూ. 520, రెండుపేపర్ల వరకు రూ.190, ఇంప్రూవ్‌మెంట్‌కు ప్రతి పేపర్‌కు రూ.190 పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు.

జీవితంపై విరక్తి చెంది వృద్ధుడి ఆత్మహత్య

గీసుకొండ: జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధుడు.. పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గ్రేటర్‌ వరంగల్‌ 17వ డివిజన్‌ వసంతాపురంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఊరుగొండ బాబురావు(67) నిత్యం మద్యం తాగి ఇంటికి వస్తుండడంతో బంధువులు అతడి తీరు నచ్చక మందలించేవారు. ఇటీవల కింద పడగా తీవ్రగాయాలు కావడంతో ఎంజీఎంలో చికిత్స పొంది ఇంటికి వచ్చాడు. అయినా తాగుడు మానకపోవడంతో భార్య మందలించింది. దీంతో మంగళవారం ఉదయం పురుగుల మందు తాగి ఇంటికి రాగా గమనించిన కుటుంబీకులు ఎంజీఎంలో చేర్పించగా అదే రోజు రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్‌ రామకృష్ణ బుధవారం తెలిపారు.

ధర్మారంలో మనస్తాపంతో యువతి ..


హరిప్రియ మృతదేహం

ఎల్కతుర్తి: ప్రియుడు పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపం చెందిన ఓ యువతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ధర్మారంలో జరిగింది. ముల్కనూర్‌ ఎస్సై సాయిబాబు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చెప్యాల హరిప్రియ(25) నర్సింగ్‌ కోర్సు పూర్తి చేసి 2 సంవత్సరాలు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో ఉద్యోగం చేసింది. అనారోగ్య సమస్యతో ఆరు నెలల క్రితం ఇంటికి వచ్చి ఇక్కడే ఉంటోంది. కాగా, అదే గ్రామానికి చెందిన గుర్రం రాజేష్‌, హరిప్రియ 5 సంవత్సరాల నుంచి ప్రేమించుకుంటున్నారు. అయితే రాజేష్‌ పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపం చెందిన హరిప్రియ.. మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి మొగిలి ఫిర్యాదు మేరకు రాజేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

‘ఆహార భద్రత’.. మరో ఐదేళ్లు

ఉచిత బియ్యం పంపిణీ గడువును పొడిగించిన కేంద్ర ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 10.92 లక్షల మంది కార్డుదారులకు లబ్ధి
- ఆనందం వ్యక్తం చేస్తున్న నిరుపేదలు


తొర్రూరు మండలం సోమారపుకుంట తండాలో రేషన్‌ బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్‌)

తొర్రూరు : కేంద్ర ప్రభుత్వం.. ఆహార భద్రత (రేషన్‌) కార్డుదారులకు తీపి కబురు తెలిపింది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు రోజురోజుకూ ఆకాశానికి చేరుతున్నాయి. ఫలితంగా కొనుగోలు చేయలేక ప్రభుత్వం సరఫరా చేసే ఉచిత బియ్యమే తింటూ జీవనం కొనసాగిస్తారు. ఈ తరుణంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మరో ఐదు సంవత్సరాల వరకు వారికి ఆహార కోసం ఇబ్బందులు తప్పనున్నాయి. ప్రధాన మంత్రి గరీబ్‌ కల్యాణ్‌ యోజన పథకం ద్వారా కరోనా కాలం నుంచి అందజేస్తున్న ఉచిత రేషన్‌ బియ్యం పంపిణీని మరో ఐదేళ్ల పాటు పొడగిస్తున్నట్లు కేంద్రం రెండు రోజుల క్రితం ప్రకటించింది. ఈ నిర్ణయంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది వరకు విడతల వారీగా బియ్యం పంపిణీ చేసిన కేంద్ర ప్రభుత్వం.. 2022 మార్చిలో ఆరు నెలలు పెంచింది. ఆ తర్వాత మరో మూడు నెలలు ఉచిత బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించింది. అదే ఏడాది చివర్లో కార్డులోని ప్రతి ఒక్కరికీ 6 కిలోల చొప్పున ఉచితంగా బియ్యం అందించాలని నిర్ణయించి అమల్లోకి తీసుకొచ్చింది. ఈ నెలతో ఆ గడువు ముగుస్తుండడంతో మరోసారి 2024 నుంచి ఐదేళ్ల పాటు అనగా 2029 సంవత్సరం వరకు యూనిట్‌కు ఆరు కిలోల బియ్యం చొప్పున అందించేందుకు నిర్ణయం తీసుకుంది.

ఉచితంగానే..

ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో 10.92 లక్షల మంది ఆహారభద్రత కార్డుదారులు ఉన్నారు. హనుమకొండ జిల్లాలో 2,66,088, వరంగల్‌ జిల్లాలో 2,19,267, మహబూబాబాద్‌ జిల్లాలో 2,35,435, భూపాలపల్లి జిల్లాలో 1,21,380, జనగామ జిల్లాలో 1,61,246, ములుగు జిల్లాలో 89,330 కుటుంబాలకు ఉచిత బియ్యం లబ్ధి చేకూరనుంది. ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో మొత్తం 2,645 రేషన్‌ దుకాణాలు ఉన్నాయి. వీటి ద్వారా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్డుదారులకు ప్రతినెలా 22,146 మెట్రిక్‌ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. కేంద్రం ఉచిత బియ్యం మరో ఐదేళ్ల పాటు అందించాలని నిర్ణయించడంతో ఆయా కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. కాగా, ఆహార భద్రత కార్డుదారులకు యూనిట్‌కు 6 కిలోలు, అంత్యోదయ కార్డుదారులకు 35 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేయనున్నారు.

తండాల్లోనూ ఏర్పాటైతే..

ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో తండాలే అధికం. గత ప్రభుత్వ హయాంలో చాలా వరకు గ్రామ పంచాయతీలుగా మారాయి. అయితే ఆయా చోట్ల రేషన్‌ దుకాణాలను మాత్రం ఏర్పాటు చేయలేదు. దీంతో ఆ తండాల నుంచి సమీప గ్రామాలకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. అక్కడికి వెళ్లడానికి ప్రైవేట్‌ వాహనాలను ఆశ్రయిస్తుండటంతో రవాణా భారం తప్పడం లేదు. కొంత మంది లబ్ధిదారులు దూరం వెళ్లలేక, చార్జీల భారం మోయలేక తెచ్చుకోవడం మానేశారు. కొన్ని చోట్ల డీలర్లు ఇష్టానుసారంగా దుకాణాలు తెరుస్తుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయమై ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి సారించి మారుమూల తండాల్లో, అవసరమైన చోట రేషన్‌ దుకాణాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ధాన్యం.. ఘనం


కేసముద్రం మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం రాశులు


పత్తి యార్డులో రైతుల పడిగాపులు

- కేసముద్రం మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం
- రికార్డు స్థాయిలో 38వేల బస్తాల రాక
- సీజన్‌ ప్రారంభం నుంచి అత్యధిక ధాన్యం రావడం ఇదే మొదటిసారి

కేసముద్రం: మహబూబాబాద్‌ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌ బుధవారం ధాన్యం రాశులతో పోటెత్తింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి మొత్తం 38 వేలకు పైగా బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది. మార్కెట్‌లో సీజన్‌ ప్రారంభమైనప్పటి నుంచి అత్యధిక ధాన్యం రావడం ఇదే మొదటి సారి. దీంతో మార్కెట్‌లోని షెడ్లు, ఓపెన్‌ యార్డు ధాన్యపు రాశులతో నిండిపోయాయి. కాగా, ధాన్యం అత్యధికంగా రావడంతో టెండర్లు ఆలస్యంగా వేశారు. 3 గంటల సమయంలో విన్నర్‌ లిస్టు విడుదలైంది. సుమారు 15వేల బస్తాల ధాన్యమే వ్యాపారులు ఖరీదు చేశారు. రాత్రి వరకు కాంటాలు, లొలకాలు జరిగాయి. మిగిలిన రైతులు రాశుల వద్దే పడికాపులు కాశారు. కాగా, మార్కెట్‌కు 38,322 బస్తాల ధాన్యం అమ్మకానికి రాగా, జైశ్రీరామ్‌ రకం ధాన్యానికి గరిష్ట ధర రూ.3,302, కనిష్ట ధర రూ.2,900, ఆర్‌ఎన్‌ఆర్‌ రకానికి గరిష్ట ధర 3,275, కనిష్ట ధర రూ.2,560, హెచ్‌ఎంటీ రకానికి గరిష్ట ధర రూ.3,236, కనిష్ట ధర రూ.1,759, బీపీటీ రకానికి గరిష్ట ధర రూ.2,000, కనిష్ట ధర రూ.1,889 పలికినట్లు మార్కెట్‌ అధికారులు తెలిపారు.

నిలిచిన పత్తి కొనుగోళ్లు..

కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో వాహనాలు వెళ్లే దారిలో ధాన్యం పోయడం వల్ల తాము ఖరీదు చేసిన పత్తిని ఎగుమతి చేయాలంటే ఇబ్బందులు తలెత్తుతున్నాయంటూ వ్యాపారులు బుధవారం టెండర్లు వేసేందుకు రాలేదు. దీంతో రైతులు పడిగాపులు కాశారు. చివరకు అధికారులను ప్రశ్నించడంతో వారు పత్తి వ్యాపారులతో చర్చలు జరిపారు. ధాన్యం అత్యధికంగా రావడం మూలంగా రైతులు ఓపెన్‌యార్డులో పోసుకున్నారని, ఇక మీదట అలా జరుగకుండా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారు. దీంతో పత్తి వ్యాపారులు టెండర్లు ఆలస్యంగా వేయడంతో రాత్రి వరకు కాంటాలు, లొలకాలు నిర్వహించారు.

కానిస్టేబుల్‌ మీర్‌ మహ్మద్‌ అలీకి అభినందన


సీపీ చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకుంటున్న కానిస్టేబుల్‌ అలీ

కాజీపేట: ఇతర రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడుతున్న ముఠాల సమాచారం అందజేస్తూ నిందితులను పట్టుకోవడానికి సహకరిస్తున్న క్రైమ్‌ వింగ్‌ కానిస్టేబుల్‌ మీర్‌ మహ్మద్‌ అలీకి తమిళనాడు, ఛత్తీస్‌గఢ్‌ పోలీసు ఉన్నతాధికారులు ప్రశంస పత్రాలు పంపించారు. వీటిని కమిషనరేట్‌లో సీపీ అంబర్‌ కిశోర్‌ ఝా బుధవారం అలీకి అందించారు. నగరంలోని మట్టెవాడ పోలీస్‌ స్టేషన్‌లో క్రైమ్‌ వింగ్‌లో విధులు నిర్వహిస్తున్న మీర్‌ మహ్మద్‌ అలీ జాతీయ స్థాయి క్రైమ్‌ విభాగానికి అనుబంధంగా ఉన్న వాట్సాప్‌ గ్రూప్‌లో సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఈ గ్రూప్‌లో ఉన్న అంతర్‌ రాష్ట్ర పోలీసులతో సంబంధాలు కొనసాగిస్తూ నేరం ఎక్కడా జరిగిన వెంటనే స్పందిస్తూ నేర పరిశోధనకు అవసరమైన సలహాలు అందించేవారు. ఇందులో భాగంగా ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లోని కొటావలి పీఎస్‌ పరిధిలో దృష్టి మరల్చి రూ.14లక్షల నగదు అపహరించిన ఘటనతో పాటు తమిళనాడులోని ఈరోడ్‌లో జరిగిన 800గ్రాముల బంగారం చోరీకి సంబంధించి సాయం అందించారు. అలీ సమాచారం ఆధారంగా పోలీసులు నిందితులను పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రం రాజ్‌నందన్‌ జిల్లా సీనియర్‌ ఎస్పీ అభిషేక్‌ మీనా, ఈరోడ్‌ ఎస్పీ అనిల్‌కుమార్‌, కోయంబత్తూర్‌ రేంజ్‌ డీఐజీ శ్రావణ్‌ సాయి సుందర్‌ 2023వ సంవత్సరానికిగానూ వరంగల్‌ క్రైమ్‌ వింగ్‌ కానిస్టేబుల్‌ అలీని అభినందిస్తూ ప్రశంస పత్రాలు పంపించారు.కాగా, అలీని మట్టెవాడ సీఐ వెంకటేశ్వర్లు అభినందించారు.

గణిత శాస్త్రంలో విస్తృత ఉపాధి అవకాశాలు

- వరంగల్‌ నిట్‌ రిటైర్డ్‌ ప్రొఫెసర్‌ వైఎన్‌ రెడ్డి



మాట్లాడుతున్న వైఎన్‌ రెడ్డి

కేయూ క్యాంపస్‌: గణితశాస్త్రంలో విస్తృత ఉపాధి అవకాశాలున్నాయని వరంగల్‌ నిట్‌ రిటైర్డ్‌ ప్రొఫెసర్‌ వైఎన్‌ రెడ్డి అన్నారు. బుధవారం కేయూలోని గణితశాస్త్ర విభాగంలో మ్యాథ్‌మెటిక్స్‌ అండ్‌ అప్లైడ్‌ మ్యాథ్స్‌మెటిక్స్‌ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఆ విభాగం అధిపతి మల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఓరియెంటేషన్‌లో వైఎన్‌ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గణితశాస్త్ర విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలన్నారు. డొమైన్‌ నైపుణ్యాలతోపాటు 21వ శతాబ్దపు నైపుణ్యాలు కూడా ముఖ్యమన్నారు.వరంగల్‌ కిట్స్‌ కళాశాల ఆచార్యులు ఎ శ్రీహరి రావు మాట్లాడుతూ గణితశాస్త్ర విద్యార్థులు నూతన ఒరవడులు కలిగి ఉండాలన్నారు. కేవలం తరగతిగదికే పరిమితం కావొదన్నారు. అసోసియేట్‌ ఆచార్యుడు ఎల్‌పీ రాజ్‌కుమార్‌ చాయిస్‌బేస్డ్‌ క్రెడిట్‌ సిస్టమ్‌, పరీక్షా విధానం గురించి వివరించారు. అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌ డాక్టర్‌ వల్లాల పృథ్వీరాజ్‌ స్కిల్స్‌, వాటి ఆవశ్యకతపై వివరిస్తూ ప్రాంగణ నియామకాల కోసం ఇప్పటి నుంచే సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్‌ తిరుమలాదేవి, డాక్టర్‌ బీఎస్‌ ఎల్‌ సౌజన్య, డాక్టర్‌ భారవిశర్మ, డాక్టర్‌సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

భద్రేశ్వరస్వామి వారికి అన్నపూజ



హన్మకొండ కల్చరల్‌ : భద్రకాళి దేవాలయంలో భద్రకాళి భక్త సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం భద్రేశ్వరస్వామి వారికి అన్నపూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేశారు.

మంత్రులను కలిసిన దేవాలయ ఈఓ..

రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కను బుధవారం హైదరాబాద్‌లో దేవాలయ ఈఓ శేషుభారతి, అర్చకులు టక్కరుసు సత్యం కలిశారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రాలు, మహాదాశీర్వచనం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అర్ధరాత్రి యువకుడిపై దాడి


రోదిస్తున్న తల్లి, బంధువులు


రాకేష్‌పై దాడి చేస్తున్న ఆకతాయి

- ఆభరణాలు, నగదు దోచుకున్న ఆకతాయిలు
- చికిత్స పొందుతూ యువకుడి మృతి
- కాశిబుగ్గ శాంతినగర్‌లో విషాదం


రాకేష్‌ (ఫైల్‌)

కాశిబుగ్గ: నగర నడిబొడ్డు వరంగల్‌ కూరగాయల మార్కెట్‌ రోడ్డులో సోమవారం అర్ధరాత్రి ఓ యువకుడు నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ సమయంలో ముగ్గురు ఆకతాయిలు ఆ యువకుడిపై విచక్షణరహితంగా దాడికి పాల్పడి అతడి వద్ద ఉన్న ఆభరణాలు, నగదు దోచుకున్నారు. ఈ దాడిలో తీవ్రగాయాల పాలైన యువకుడు వరంగల్‌ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం వెలుగులోకి రావడంతో కాశిబుగ్గ శాంతినగర్‌లో విషాదం నెలకొంది. 20వ డివిజన్‌ కాశిబుగ్గ శాంతినగర్‌కు చెందిన ఏకెల్లి రమేష్‌, మరియ దంపతులకు ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. 10 ఏళ్ల క్రితం తండ్రి రమేష్‌ చనిపోవడంతో అన్నదమ్ములు దేవరాజ్‌, రాకేష్‌(23) బాధ్యత తీసుకుని రెండు సంవత్సరాల క్రితం సోదరి పెళ్లి చేశారు. ఈ క్రమంలో రాకేష్‌ వంట పని కోసం సోమవారం హనుమకొండకు వెళ్లాడు. అర్ధరాత్రి మహిళ విజయతో కలసి ఇంటికి చేరుకోవడానికి వరంగల్‌ బస్టాండ్‌కు చేరుకున్నారు. ఆ సమయంలో ఆటోలు లేకపోవడంతో నడుచుకుంటూ ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో వరంగల్‌ చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ కార్యాలయం వద్దకు రాగా ముగ్గురు ఆకతాయిలు మద్యం మత్తులో వారిని అడ్డుకున్నారు. విజయను బెదిరించి రాకేష్‌పై దాడికి పాల్పడ్డారు. అనంతరం రాకేష్‌ వద్ద ఉన్న బంగారు ఆభరణాలు, రూ. 6,500 నగదును దోచుకెళ్లారు. తీవ్రగాయాల పాలైన రాకేష్‌ను విజయ స్థానికుల సాయంతో ఎంజీఎంకు తరలించి కుటుంబీకులకు సమాచారమిచ్చారు. అక్కడ చికిత్స పొందుతున్న రాకేష్‌ మంగళవారం రాత్రి చెందాడు. కాగా, రాకేష్‌ మృతికి కారణమైన ఆకతాయిలపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, అలాగే మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువులు, కాలనీ వాసులు డిమాండ్‌ చేశారు. ఇంతేజార్‌గంజ్‌ పోలీసు స్టేషన్‌ పరిధిలో శాంతిభద్రతలు లోపించాయని వివరించడానికి ఈ ఘటన కారణమని చెప్పొచ్చని వారు పేర్కొంటున్నారు. కాగా, దాడికి సంబంధించిన సీసీ కెమెరాల పుటేజీలు వాట్సాప్‌లో వైరల్‌ కావడంతో దుండగులను గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. రాకేష్‌ మృతదేహాన్ని కార్పొరేటర్‌ గుండేటి నరేంద్రకుమార్‌, కాంగ్రెస్‌ నాయకులు నవీన్‌రాజ్‌, మాజీ కార్పొరేటర్‌ బయ్యా స్వామి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

కదులుతున్న బస్సు నుంచి దూకి ..

- ఛత్తీస్‌గఢ్‌ వాసి మృతి
- ఏటూరునాగారంలో ఘటన


మంగాలు మృతదేహం

ఏటూరునాగారం: కదులుతున్న బస్సు నుంచి దూకి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం ఏటూరునాగారం మండల కేంద్రంలో జరిగింది. ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మాడవి మంగాలు(43) ఇటీవల ఏటూరునాగారంలో ఉంటున్న బంధువుల వద్దకు వచ్చాడు. తిరిగి ఇంకొందరు బంధువులు ఉంటున్న భద్రాచలం వెళ్లడానికి ఏటూరునాగారం బస్టాండ్‌కు చేరుకున్నాడు. ఇక్కడ హనుమకొండ వెళ్లే బస్సులో కూర్చున్నాడు. అయితే ఏ గ్రామం వెళ్లాలని కండక్టర్‌ అడగగా భద్రాచలమని సమాధానం ఇచ్చాడు. ఈ బస్సు హనుమకొండకు వెళ్తుందని, వేరే బస్సులో ప్రయాణించాలని కండక్టర్‌ సూచించాడు. దీంతో అప్పటికే అతిగా మద్యం తాగి ఉన్న మంగాలు బస్సు కదులుతుండగానే అందులో నుంచి దూకాడు. తీవ్ర గాయాలు కావడంతో కండక్టర్‌ జితేందర్‌రెడ్డి, డ్రైవర్‌ స్వామి వెంటనే 108లో సామాజిక ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సామాజిక ఆసుపత్రికి తరలించారు. కాగా, ఓ వ్యక్తి ఆర్టీసీ బస్సు నుంచి దూకి మృతి చెందిన ఘటనను తెలుసుకున్న డీఎం సురేష్‌ బుధవారం రాత్రి ఘటనా స్థలిని పరిశీలించారు. ప్రమాద తీరుపై తెలుసుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు.

సాగరంలో చెరువులో పడి వ్యక్తి ..


దస్రూ (ఫైల్‌)

జఫర్‌గఢ్‌: చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని సాగరంలో జరిగింది. ఎస్సై మహేందర్‌ కథనం ప్రకారం.. రేగడితండా గ్రామ శివారు టీబీతండాకు చెందిన గుగులోతు దస్రూ (46) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం పొలం వద్దకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు దస్రూ కోసం గాలించగా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో బుధవారం ఉదయం సాగరం గ్రామ చెరువులో ఓ మృతదేహం పైకి తేలింది. దీనిని గమనించిన స్థానికులు పోలీసులకు తెలిపారు. దీంతో ఎస్సై మహేందర్‌ వెంటనే ఘటనా స్థలికి చేరుకుని చెరువు నుంచి మృతదేహాన్ని బయటకు తీయించారు. అనంతరం కుటుంబీకులకు సమాచారం అందించగా వారు ఘటనాస్థలికి చేరుకుని దస్రూ మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. ఈ ఘటనపై మృతుడి భార్య బుజ్జమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రుద్రేశ్వరాలయంలో ఘనంగా గౌరీనక్తం


గౌరీనక్త వ్రతం నిర్వహిస్తున్న అర్చకులు

హన్మకొండ కల్చరల్‌: రుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల దేవాలయంలో బుధవారం గౌరీనక్త వ్రత పూజలు ఘనంగా నిర్వహించారు. వేదపండితులు మణికంఠశర్మ, అర్చకులు సందీప్‌శర్మ, ప్రణవ్‌ ప్రత్యేక పూజలు జరిపారు. నాట్యమండపంలో 21 కిలోల పసుపుతో గౌరీమాతగా అలంకరించి పూజలు జరిపారు. కుంకుమార్చనలు, సహస్ర నామార్చనలు నిర్వహించారు. మహిళలు లలితాసహస్ర నామపారాయణం చేశారు.

ఆదాయం రూ.3,89,706

వేయిస్తంభాల ఆలయ నెలవారీ హుండీ ఆదాయం రూ. 3,89,706గా నమోదైనట్లు దేవాలయ ఈఓ వెంకటయ్య తెలిపారు. హుండీ లెక్కింపులో పరిశీలకులుగా దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్‌ అనిల్‌కుమార్‌ వ్యవహరించారు.

నీరు.. నిర్లక్ష్యం వద్దు!

పశువులకు శుభ్రమైన నీరే ప్రధానం
- అధిక పాలదిగుబడికి అత్యంత కీలకం
- తక్కువైతే మూత్ర సంబంధ వ్యాధులు
- నిర్లక్ష్యం చేస్తే అనారోగ్యం బారిన పడే అవకాశాలు




నీరు తాగుతున్న పశువులు

కాజీపేట: పశుపోషణలో దాణా, మేతతో పాటు తాగునీటి విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలి. అయితే పశుపోషకులు మొదటి, రెండు విషయాల్లో తీసుకుంటున్న శ్రద్ధ తాగునీటి విషయంలో తీసుకోవడం లేదు. పశువులకే కదా! అని గుంతల్లో నిలిచిన నీటిని తాగిస్తారు. అలాగే, తక్కువ పరిణామంలో అందిస్తున్నారు. ఫలితంగా పశువులు అనారోగ్యం బారినపడి పాడి పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని పాడి పశువుల తాగునీటి అవసరాలు, వాటి సంరక్షణపై సోమిడి పశువైద్యాధికారి కరుణాకర్‌రెడ్డి రైతులకు పలు సూచనలు ఇస్తున్నారు.

అవసరమైన నీరు అందించాలి..

పశువులు ఆహారం లేకుండా వంద రోజులైనా జీవిస్తాయి. కానీ నీరు లేకుండా నాలుగైదు రోజులకు మించి బతకలేవు. శరీరంలో కొవ్వు మొత్తం పోయినా, 50 శాతం వరకు మాంసకృత్తులు పోయినా పర్వాలేదు గాని.. పది శాతం నీరు పోతే ప్రాణాంతకమవుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని పశువులకు నీటి ప్రాధాన్యం గుర్తించాలి. దాణా, మేతతో పాటు తగినంత నీటిని అందించినప్పుడే పాల దిగుబడిలో పెరుగుదల కనిపిస్తుంది. వర్షాభావ పరిస్థితుల్లో మరింత జాగ్రత్తలు తీసుకోవాలి.

అధిక పాల దిగుబడి కోసం..

పాడి పశువుల్లో పాల ఉత్పత్తికి నీరు చాలా అవసరం. పాలల్లో 80 శాతం వరకు నీరు ఉంటుంది. ప్రతీ లీటర్‌ పాల ఉత్పత్తికి పశువుకు కనీసం నాలుగైదు లీటర్ల నీరు ముఖ్యం. పశువులకు నీరు సరిపడినంత అందకపోతే పాల దిగుబడి తగ్గిపోతుంది.

రోజుకు 40 నుంచి 50 లీటర్లు నీరు..

సాధారణంగా పాడిపశువు రోజు 40 నుంచి 50 లీటర్లు నీరు తాగుతాయి. పాలిచ్చే పశువులు అయితే ప్రతి లీటర్‌ పాలకు నాలుగైదు లీటర్ల నీరు తాగుతాయి. అనావృష్టి పరిస్థితుల్లో పశువులకు పీచు పదార్థం ఎక్కువగా ఉండే ఎండుగడ్డి, జొన్న చొప్ప, సజ్జవంటి మేత వేయాల్సి ఉంటుంది. అందుకే పశువు ఎక్కువ నీరు తాగుతుంది. పచ్చగడ్డి సమృద్ధిగా లభించినప్పుడు నీటి అవసరం కొంత తగ్గుతుంది. చూడి పశువులకు నీరు ఎక్కువగా ఇవ్వాలి. పశువులకు రోజుకు రెండు, మూడు దఫాలు నీటిని పెడుతూ ఉండాలి. వేసవిలో పశువు నీరు తాగడానికి 24 గంటలు పరిశుభ్ర చల్లని నీరు అందుబాటులో ఉంచితే మరింత మంచిది.

నీరు తక్కువైతే...

పశువులకు నీటి లభ్యత తక్కువైతే జీర్ణక్రియ వ్యవస్థ దెబ్బతిని మూత్ర సంబంధ సమస్యలు ఎదురవుతాయి. నీటి లభ్యత బాగా తగ్గితే వేసవిలో పశువులకు రక్త శాతం కూడా తగ్గుతుంది. శరీర ఉష్ణోగ్రత పెరిగి చివరకు పశు మరణాలు సంభవిస్తాయి.

జాగ్రత్తలు తీసుకోవాలి..

పాడి, వ్యవసాయ పశువులకు నీటిని తాగించే ముందు జాగ్రత్తలు పాటించాలి. నీటిలో కరిగి ఉన్న కాల్షియం, మెగ్నీషియం, ఉప్పుపై నీటి నాణ్యత ఆధారపడి ఉంటుంది. నీరు కొంచెం ఉప్పుగా ఉన్నా పశువులు క్రమేపి అలవాటుపడి తాగుతాయి. కానీ నీటిలో నైట్రేట్లు ఎక్కువగా ఉండడం మంచిది కాదు. మేతకు బయటకు వెళ్లే పశువులు అపరిశుభ్రంగా ఉండే నీటిని తాగితే వ్యాధుల బారిన పడతాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని పశుపోషకులు జాగ్రత్తలు తీసుకోవాలి.